క్లుప్తంగా

విద్యార్థికి ఆర్థిక సాయం


సాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

అంబాజీపేట: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న విద్యార్థికి గంగలకుర్రు అగ్రహారం జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు గురువారం ఆర్థిక సాయాన్ని అందజేశారు. స్థానిక ఉన్నత పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న దర్శపాటి ప్రశ్వంత్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడని హెచ్ఎం ఖండవిల్లి శ్రీనివాసు చెప్పారు. అతని వైద్య ఖర్చుల నిమిత్తం ఉపాధ్యాయులు, విద్యార్థులు రూ.13వేలు సేకరించి విద్యారిథ తల్లి రాజేశ్వరికి అందజేశామన్నారు. దాతలు ఎవరైనా ఆదుకోవాలని విద్యార్థి తల్లి కోరుతోందన్నారు.

బీమాతో కుటుంబానికి ధీమా

అంబాజీపేట: జీవిత బీమా చేయడం వల్ల ఆ కుటుంబానికి ధీమా వస్తుందని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) 67వ వ్యవస్థాపక వారోత్సవాలను పురస్కరించుకుని శాటిలైట్ ఆఫీస్ మేనేజరు కె.లలిత్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక శాటిలైట్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్ఐసీ పై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. కార్యాలయాధికారి మాణిక్యాంబ, డెవలప్‌మెంట్ ఆఫీసర్‌లు ఎ.అప్పారావు, కె.కె.రాజు, డి.వీరేంద్రకుమార్, సీహెచ్.హేమలత పాల్గొన్నారు.

విరిగిపడ్డ లారీ చక్రాలు

ట్రాఫిక్ జామ్

ఆలమూరు: ఆలమూరు–మండపేట రోడ్డులో ఇసుక లారీ చక్రాలు విరిగిపడిన ఘటనలో సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం జొన్నాడ నుంచి మండపేట వైపు ఇసుక లోడుతో వెళుతున్న ఆరు యూనిట్ల లారీ బుధవారం రాత్రి 11 గంటల సమయంలో దేవి థియేటర్ సమీపంలోకి వచ్చేసరికి గోతిలో పడి వెనుక చక్రాలు రెండూ ఊడిపోయాయి. దీనివల్ల ట్రాఫిక్‌కు కొంత సేపు అంతరాయం కలగగా పోలీసులు వచ్చి క్రమబద్ధీకరించారు. అయితే రోడ్డు మధ్యలో ఆగిపోయిన లారీ పక్క నుంచి మరో లారీ వెళుతూ బురదలో దిగిపోయింది. దీంతో ఇరువైపులా వచ్చే వాహనాలు రాకపోకలు సాగించే అవకాశం లేక ప్రయాణికులు, వాహనదారులు గంటల తరబడి ఇబ్బందులు పడ్డారు.

ఉచితంగా రక్త పరీక్షలు

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో వైరల్ జ్వరాలు అధికంగా ఉన్నాయని వీటికి సంబంధించి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా రక్త పరీక్షలు చేస్తారని వాటిని సద్వినియోగం చేసుకోవాలని అంబాజీపేట పీహెచ్‌సీ వైద్యాధికారులు వి.గౌతమి, శ్రీనివాస్ అన్నారు. తొండవరం, వాకలగరువు గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టైఫాయిడ్, మలేరియా తదితర రోగాలకు వైద్య పరీక్షలు పీహెచ్‌సీల్లో చేస్తున్నారన్నారు. ప్రతీ ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. అనంతరం సుమారు 130 మంది రోగులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు.

'భోజనం' నాణ్యత పరిశీలన

మామిడికుదురు: సర్వశిక్షాభియాన్ ఏపీడీ డాక్టర్ ఎంఏకే భీమారావు స్వచ్ఛత పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా గురువారం మామిడికుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజనం పథకం నాణ్యతను పరిశీలించారు. పరిశుభ్రత ప్రాధాన్యంపై విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

చురుగ్గా ఈ–క్రాప్ బుకింగ్

సఖినేటిపల్లి: మండలంలో ఈ–క్రాప్ బుకింగ్ చురుగ్గా సాగుతోందని జిల్లా వ్యవసాయ శాఖాధికారి వి.బోసుబాబు అన్నారు. గురువారం శృంగవరప్పాడులో మాలే ఆదినారాయణ కొబ్బరి తోటలో సిబ్బంది చేస్తున్న ఈ–క్రాప్ బుకింగ్‌ను ఆయన పరిశీలించారు. వరి పంట సార్వాలో సాధారణ విస్తీర్ణం 685 ఎకరాలకు గాను ఇంతవరకూ వరి నాట్లు పూర్తయిన 205 ఎకరాల్లో ఈ–క్రాప్ బుకింగ్ పూర్తయినట్టు చెప్పారు. మండలంలో కొబ్బరి పంట విస్తీర్ణం 7,500 ఎకరాలు ఉండగా, ఇంతవరకూ 2,494 ఎకరాల్లో ఈ–క్రాప్ బుకింగ్ నమోదైనట్టు ఏవో పీవీ నరసింహరావు అన్నారు. ఏడీఏ ఎస్‌జేవీ రామ్మోహన్‌రావు, మండల సలహా మండలి చైర్మన్ ఇంజేటి శామ్యూల్‌రాజు, రైతులు మద్దాల భాను, రావి త్రిమూర్తులు పాల్గొన్నారు.

పోస్టరు ఆవిష్కరణ

సఖినేటిపల్లి: సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారానికి ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న వేడుకోలు నిరాహార దీక్ష పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఉద్యోగులు రాజబాబు, సాగర్, కిషోర్, శాంతి, దివ్య, సంధ్య, కమల, జానకి, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఐరన్ సిరప్ అందజేత

ఆలమూరు: మండలంలోనున్న 39 ఎంపీపీ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం ఐరన్ సిరప్ అందజేశారు. కేంద్ర ప్రభుత్వ ఎనిమియా ముక్తి భారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అందజేశారు.

నిబంధనల సడలింపు.. అర్హుల గుర్తింపు

- ఒంటరి వారికి రేషన్‌కార్డులు
- గ్రామ వలంటీర్ల ద్వారా దరఖాస్తుల స్వీకరణ
- సచివాలయాల్లో సత్వర మంజూరు

ఆలమూరు: రాష్ట్రంలో అర్హులైన వారందరికి అభివృద్ధి, సంక్షేమ పథకాలు మంజూరు చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో అనేక పథకాలను అమలు చేస్తూ పేదల పాలిట ఆపద్బాంధవుడు అయ్యారు. గతంలో ఒంటరి వ్యక్తులకు రేషన్‌కార్డు మంజూరు చేసే అవకాశం ఉండేది కాదు. దీంతో వారంతా అనేక సంక్షేమ పథకాలకు దూరమయ్యేవారు. వైఎస్సార్ సీపీ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టాక రేషన్‌కార్డుల మంజూరులో నిబంధనలు సడలించింది. ఒంటరి వ్యక్తులకు సైతం రేషన్‌కార్డులను మంజూరు చేయాలని సంకల్పించింది. ఒంటరి వ్యక్తులు కూడా రైస్‌కార్డు పొందేలా మార్గదర్శకాలు విడుదల చేసి మంజూరు ప్రక్రియను వేగవంతం చేశారు. దీంతో ఏళ్ల తరబడి రేషన్‌కార్డుల కోసం నిరీక్షిస్తున్న ఒంటరి వ్యక్తుల కల నెరవేరింది. అర్హులందరూ రైస్ కార్డులు పొంది ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకుంటూ ప్రభుత్వ పనితీరును ప్రశంసిస్తున్నారు.


చింతలూరులో రేషన్‌కార్డు దరఖాస్తును ఆన్‌లైన్ చేస్తున్న సచివాలయ సిబ్బంది

గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి

రైసుకార్డు లేని ఒంటరి వ్యక్తులు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని గ్రామ వలంటీర్లు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. అర్హులందరితో దరఖాస్తులు చేయిస్తున్నారు. ఒంటరిగా ఉంటున్న మహిళలు, పురుషులకు రైస్ కార్డుల మంజూరు కోసం వలంటీర్ల ద్వారా దరఖాస్తు తీసుకుని పూర్తి వివరాలను నింపాలి. ఆయా గ్రామాల వీఆర్‌ఓలు దరఖాస్తులను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ద్వారా పరిశీలన జరిపి తహసీల్దార్‌కు నివేదిస్తారు. అర్హులైన వారికి గ్రామ/వార్డు సచివాలయాల్లోనే రైస్ కార్డులను జారీ చేస్తారు. ఒంటరి వ్యక్తి రైస్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునేవారు తప్పనిసరిగా ఈ–కేవైసీ చేయించుకుని బయోమెట్రిక్ వేలిముద్రలు వేయాల్సి ఉంటుంది.


ఒంటరి మహిళలకు మంజూరు చేసిన రేషన్‌కార్డు

రేషన్‌కార్డులకు అర్హులు వీరే..

- భర్తను కోల్పోయి పిల్లలు లేని ఒంటరి మహిళలు
- భార్య మృతి చెంది పిల్లలు లేని ఒంటరి పురుషులు
- 50 ఏళ్లు పైబడి పెళ్లి కాని పురుషుడు లేదా మహిళ, కుటుంబ సభ్యులు లేని నిరాశ్రయులైన వారు.
- ఒంటరి ట్రాన్స్‌జెండర్లు
- ఇప్పటి వరకు ఏ రైస్‌కార్డులో లేనివారు.

ఒంటరి వ్యక్తులకు రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నాం

రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాల మేరకు అర్హులై ఉండి వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి వారి అర్హతలను పరిశీలించి ఏడాదికి రెండు సార్లు కొత్త రైస్ కార్డులు మంజూరు చేస్తాం.



– జీపీ శెట్టి, తహసీల్దార్, ఆలమూరు

కుక్కకాటు దోష నివారణకు వ్యాక్సిన్

ఆలమూరు: కుక్కకాటు దోష నివారణకు వినూత్న రీతిలో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ (ఏఆర్‌వీ)ను కుక్కలకు అందించిన సంఘటన ఆలమూరు మండలంలోని మోదుకూరులో గురువారం జరిగింది. కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతూ ప్రజలను గాయపర్చుతున్నాయని గ్రామస్తులు స్పందనలో ఇచ్చిన ఫిర్యాదుపై గ్రామ పంచాయతీ సత్వరమే స్పందించింది. గ్రామ సర్పంచ్ పెంటపాటి శ్యామల వెంకట్రావు, ఈఓపీఆర్‌డీ పిఆర్‌సీ రాజ్‌కుమార్, కార్యదర్శి పి.రాజు నేతృత్వంలో పశు వైద్యాధికారి జి.సుభాష్, క్షేత్ర స్థాయి గ్రామ సహాయకులు కె.రమేష్ తదితరులు గ్రామంలో ఉన్న కుక్కలన్నింటిని పట్టుకుని ఏఆర్‌వీని అందజేశారు. దీనివల్ల పొరపాటున కుక్క కరిచినా ఏవిధమైన దోషం ఉండదని వైద్యాధికారి సుభాష్ పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు చుండ్రు సునీత, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నల్లి రాజు, ఆకుల రామకృష్ణ పాల్గొన్నారు.

మారెమ్మ ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

కొత్తపేట: మండల పరిధిలోని వాడపాలెం గ్రామ దేవత మారెమ్మ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో సుమారు 1.5 కోట్ల వ్యయం కాగల ఈ ఆలయ పునర్నిర్మాణానికి టీటీడీ వేదపండితుడు బ్రహ్మశ్రీ అల్లవరపు సుబ్రహ్మణ్యదీక్షిత అవధాని ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన గనిశెట్టి పుల్లయ్యనాయుడు దంపతులు, పచ్చిపులుసు బుజ్జిబాబు దంపతులు ఉదయం 11.21 గంటలకు శంకుస్థాపన చేయించారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాసరావు ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దేవదాయ, ధర్మాదాయ శాఖ ద్వారా నిధులు మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామ సర్పంచ్ త్సామా బాబు, మండల ఏఏబీ చైర్మన్ పెదపూడి శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు మట్టా బాబ్జి, రైతు సంఘం అధ్యక్షుడు పెదపూడి బాపిరాజు, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ బండారు సూర్యప్రకాష్ పాల్గొన్నారు.


శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఇమామ్ హుస్సేన్ పరివారానికి ఘన నివాళి

రక్తం చిందించిన ముస్లింలు

మామిడికుదురు: సత్యం, ధర్మం, న్యాయం, కోసం 72 మంది పరివారంతో పాటు తన ప్రాణాలను సైతం అర్పించిన ముస్లింల ఆరాధ్య దైవం హజరత్ ఇమామ్ హుస్సేన్‌కు గురువారం ముస్లింలు ఘనంగా నివాళులర్పించారు. ఇమామ్ హుస్సేన్ అర్బయీన్ (అమరత్వం పొందిన 40వ రోజు) సందర్భంగా గుండెలు బాదుకుంటూ మాతం నిర్వహించారు. నగరం బడే బీబీ పంజాలో ఈ సందర్భంగా మజ్లిస్ జరిగింది. గుర్రంపై పీరును ఊరేగిస్తూ మాతం నిర్వహించారు. మంజిలే కర్బలాలో గురుహే తాజ్‌దారే పురాత్ భక్త బృందం ఆధ్వర్యంలో అర్బయీన్ కార్యక్రమం జరిగింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన మత ప్రబోధకులు యూసుప్ అహ్మద్ మషద్దీ కర్బలా సంఘటనల అనంతరం జరిగిన ఘట్టాలను భక్తులకు వివరించారు. ఇస్లాం మతం ఉనికిని పరిరక్షించిన ఇమామ్ హుస్సేన్, అతని తనయుడు జైనుల్ ఆబేదీన్, సోదరి బీబీ జైనబ్‌లకు అంజలి ఘటించారు. కత్తులు, బ్లేడులతో తమ శరీరాలను గాయపర్చుకుంటూ 'హుస్సేన్... హుస్సేన్...' అని నినదిస్తూ రక్తం చిందించారు. నగరం పంజీషా వరకు ఈ కార్యక్రమాలు జరిగాయి. అనంతరం మామిడికుదురు వరకు పీరును ఊరేగించారు. హజరత్ అబ్బాస్ పంజాలో కూడా మజ్లిస్ జరిగింది. పలు భక్త బృందాలు భక్తులకు ప్రసాదాలు వితరణ చేశాయి. వేల సంఖ్యలో ముస్లింలు అర్బయీన్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నగరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ప్రత్యేక శిబిరం ద్వారా ముస్లింలకు వైద్య సేవలందించారు.


నగరంలో మాతం నిర్వహిస్తున్న ముస్లింలు

ఇంటి రుణాలిప్పిస్తామని నగదు వసూలు

అయినవిల్లి: మండలంలోని శానపల్లిలంకలో హౌసింగ్ రుణా లిప్పిస్తామని ఓ వ్యక్తి నగదు వసూలు చేశాడంటూ అ గ్రామ ఎంపీటీసీ సభ్యుడు పచ్చిమాల సుబ్బారావు గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఎంపీడీఓ తాడి శ్రీ వెంకటాచార్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని మూడో వార్డు మెంబర్ కడలి నాగమహేశ్వరరావు హౌసింగ్ అధికారులు డబ్బులు వసూలు చేయమన్నారు అని చెప్పి గ్రామంలోని 19 మంది వద్ద రూ.వేయి చొప్పున వసూలు చేశారని తనకు వివరించారన్నారు. ఇప్పటి వరకూ దీనిపై ఏ విధమైన రుణం ఇవ్వలేదన్నారు. ప్రజలను మోసగించిన వ్యక్తిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

విద్యుత్ మొండి బకాయిలపై స్పెషల్ డ్రైవ్

మలికిపురం: మండలంలో గురువారం విద్యుత్ మొండి బకాయిలపై అమలాపురం ఈఈ ఎం.రవికుమార్, ఏఈ ఎం.సతీష్ ఆధ్వర్యంలో 30 మంది వివిధ కేటగిరిల్లోని ఆ శాఖ సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. చింతలమోరి, మలికిపురం, గుడిమెళ్లంక, కేశనపల్లి, లక్కవరం, తూర్పుపాలెం గ్రామాల్లో పై డ్రైవ్ వారు చేపట్టారు. ఈ డ్రైవ్‌లో మొండి బకాయిల బిల్స్ మండల వ్యాప్తంగా రూ.16 లక్షలు వసూలు చేసినట్టు రవికుమార్ అన్నారు. వీటితోపాటు ఏసీడీ డిపాజిట్టు రూ.3 లక్షలు, అదనపు లోడ్ బకాయిలు రూ.2 లక్షలు వసూలు చేసినట్టు చెప్పారు.

సఖినేటిపల్లి: మండలంలో విద్యుత్ మొండి బకాయిలపై అమలాపురం ఈఈ ఎం.రవికుమార్ ఆధ్వర్యంలో 20 మంది వివిధ కేటగిరిల్లోని ఆ శాఖ సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అంతర్వేది, గొంది, అంతర్వేదికర, గుడిమూల గ్రామాల్లో డ్రైవ్ చేపట్టారు. మొండి బకాయిలు ఉన్న 45 ఆక్వా సరీస్సులకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేసినట్టు రవికుమార్ అన్నారు. వీటితో పాటు విద్యుత్ బిల్లులు చెల్లించని మోరి, మోరిపోడు, శృంగవరప్పాడు గ్రామాల్లో గల 10 జీడిపప్పు కంపెనీలకు విద్యుత్ సదుపాయం నిలుపుదల చేశామన్నారు. ఈ డ్రైవ్‌లో ఆక్వా సర్వీసులు, ఇతర జీడిపప్పు కంపెనీల నుంచి రూ.51 లక్షలు విద్యుత్ బిల్లులు వసూలు చేశామన్నారు. ఏడీ శ్రీనివాస్, ఏఈ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వరసిద్ధి వినాయక విగ్రహ ప్రతిష్ఠ

ఆలమూరు: శ్రీవరసిద్ధి వినాయక విగ్రహ ప్రతిష్ఠ ఆలమూరులో గురువారం వైభవంగా జరిగింది. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రావాడ సత్తిబాబు, సత్యపద్మ దంపతుల ఆధ్వర్యంలో శ్రీసిద్ధార్థ హైస్కూల్ సమీపంలోని కాలనీలో నిర్మాణం జరుపుకున్న ఈ ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవానికి కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వేద పండితులు కాళ్ళకూరి దుర్గాప్రసాద్ శర్మ, కాళ్లకూరి సూరిపండు, వెల్లవలపల్లి చైతన్య కృష్ణ ఆధ్వర్యంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం యాగశాలను సందర్శించి హోమగుండం వద్ద పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సమారాధన జరిగింది. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, సర్పంచ్ నేలపూడి లావణ్య, కోలా నానీ, రావాడ వెంకట నరేష్, ఉండమట్ల బూరయ్య పాల్గొన్నారు.


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

కొత్త ఓట్ల నమోదుపై దృష్టి

రాజోలు: నియోజకవర్గంలో కొత్త ఓట్లు నమోదుపై దృష్టి సారించాలని రాజోలు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.శివశంకరప్రసాద్ సూచించారు. గురువారం రాజోలు తహసీల్దారు కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. కళాశాలల్లో విద్యార్థులకు ఓటు నమోదుపై అవగాహన కల్పించాలన్నారు. ఒకే ఇంటి నంబరుతో 10 మంది ఓటర్లు మించకూడదన్నారు. రాజోలు నియోజకవర్గంలో సుమారు 500లకు పైగా అలాంటి ఓట్లు గుర్తించి సుమారు 200 ఓట్లు సవరించామని ఇంకా 353 ఓట్లు ఉన్నాయన్నారు. మోరి, మోరిపోడు, శివకోడుపాలెం పోలింగ్ బూత్‌ల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. 100 ఏళ్ల పైబడి ఉన్న ఓటర్లను గుర్తించామని, వారిలో చాలామంది ఆధార్ కార్డులో వయసు తప్పుగా నమోదు అయినవారు అని తెలుసుకున్నామన్నారు. అలాంటి ఓట్లును సవరిస్తున్నామన్నారు. రాజోలు, మలికిపురం తహసీల్దార్లు బి.ఎం.ముక్తేశ్వరరావు, వి.వి.ఎల్.నరసింహారావు, డిప్యూటీ తహసీల్దార్లు చెల్లుబోయిన భాస్కరరావు, శ్రీనివాస్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.


రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి శివశంకర్ ప్రసాద్

సుభిక్ష పాలన...అభివృద్ధి బావుటా

- ఎమ్మెల్యే వరప్రసాదరావు
- బి.సావరంలో గడప గడపకూ మన ప్రభుత్వం

రాజోలు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సుభిక్ష పాలనతోపాటు అభివృద్ధి బావుటా ఎగురవేశామని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. గురువారం బి.సావరం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. స్థానిక డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే వివరించారు. అంబేడ్కర్ ఆశయసాధన దిశగా సీఎం జగన్ రాజకీయంగా అన్ని సామాజిక వర్గాలకు సముచిత స్థానం ఇచ్చారన్నారు. ముఖ్యంగా మహిళలకు సామాజికంగా, ఆర్థికంగా భరోసా ఇస్తూ రాజకీయంగా అనేక పదవులను కేటాయించారన్నారు. సుభిక్ష పాలనతోపాటు పరిపాలన వికేంద్రీకరణకు పెద్దపీట వేసి గ్రామ సచివాలయం, వలంటీరు వ్యవస్థలను తీసుకువచ్చారన్నారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. ఎలాంటి వివక్ష, అవినీతికి తావులేకుండా నిష్పక్షపాతంగా లబ్ధిదారులను ఎంపిక చేసి నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు మట్టా శైలజ, ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, సర్పంచ్ కడియం రమాదేవి, ఎంపీటీసీ సభ్యులు బత్తుల హేమలత, చెల్లింగి లక్ష్మీఈశ్వరి, సొసైటీ అధ్యక్షుడు కంచి వెంకటరమణ, నాయకులు కడియం పూర్ణచంద్రరావు, కుంపట్ల చిన్నారి, తిక్కిశెట్టి శ్రీనివాసరావు, కడలి వెంకట సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.


బి.సావరంలో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాపాక

వసంత మంటపం పునర్నిర్మాణానికి శంకుస్థాపన

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం పరిధిలో పూర్తి శిథిల స్థితికి చేరుకున్న వసంత మంటపం పునర్నిర్మాణానికి రూ.18 లక్షల గ్రాంటుతో చేపట్టబోయే పనులకు అమలాపురం ఆర్డీవో ఎస్‌వీబీ వసంతరాయుడు దంపతులు గురువారం శంకుస్థాపన చేశారు. తొలుత ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పర్యవేక్షణలో ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు, వేద పండితుడు చింతా వేంకటశాస్త్రి వేద మంత్రాలతో పూజలు నిర్వహించారు. అంతర్వేదిలో ఏటా ఫిబ్రవరిలో నిర్వహించే స్వామివారి కల్యాణ మహోత్సవాల్లో పౌర్ణమి రోజున సముద్ర స్నానం అనంతరం స్వామి వసంత మంటపంలో సేద తీరుతారని, అయితే కాలక్రమంలో ఇది పూర్తిగా శిథిలమైందని ఏసీ సత్యనారాయణ తెలిపారు. అదే చోట రాతితో వసంత పునర్నిర్మాణానికి పనులు చేపడతామన్నారు. ఇందులో రూ.9 లక్షలు అమలాపురం ఆర్డీవో గ్రాంటు, మరో రూ.9 లక్షలు దేవస్థానం గ్రాంటు నుంచి సమకూర్చుకున్నట్టు సత్యనారాయణ తెలిపారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంపీటీసీ సభ్యులు బైర నాగరాజు, పోతాబత్తుల భాస్కరరావు, సర్పంచ్‌లు కొండా జాన్‌బాబు, ఒడుగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

11 నుంచి స్కూల్ గేమ్స్

రావులపాలెం: ఈ నెల 11 నుంచి 13 తేదీ వరకూ మూడు రోజులపాటు మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు ఎంఈఓలు క్రిష్టఫర్, శ్రీనివాసరాజు తెలిపారు. గురువారం స్థానిక మండల వనరుల కేంద్రంలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ టోర్నమెంట్ కం సెలెక్షన్స్ నిర్వహణపై ఎంఈఓలు సమీక్షించారు. తొమ్మిది విభాగాల్లో స్కూల్ గేమ్స్ పోటీలు జరుగుతాయని మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కె.లక్ష్మి ప్రసూన తెలిపారు. కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ ,షటిల్, త్రోబాల్, టెన్నికాయిట్, యోగా, అథ్లెటిక్స్ పోటీలను ఈనెల 11, 12 ,13 వ తేదీల్లో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించాలని నిర్ణయించారు. ఈ పోటీల్లో విజయం సాధించినవారు నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. సమావేశంలో మండలంలోని తొమ్మిది జెడ్పీ హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రైవేట్ స్కూల్స్ వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు

కొత్తపేట: ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేసే ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సమాజంలో ఎప్పుడూ తగిన గుర్తింపు ఉంటుందని మోడేకుర్రు సర్పంచ్ కుడుపూడి రామలక్ష్మి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న మోడేకుర్రు శివారు కడలివారిపాలెం ఎంపీపీ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పి.సత్యవతి, ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ వెటర్నరీ అసిస్టెంట్ అవార్డు అందుకున్న బొక్కే శ్రీనివాస్ అభినందన కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. మోడేకుర్రు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో సర్పంచ్ కుడుపూడి రామలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో హెచ్ఎం సత్యవతి దంపతులను, వీఏ శ్రీనివాస్‌ను సత్కరించారు. హైస్కూల్ హెచ్ఎం వీవీఎస్ రామచంద్రమూర్తి, వైఎస్సార్ సీపీ నాయకుడు కుడుపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి

అంబాజీపేట: శ్రీకృష్ణాష్టమి వేడుకలను అంబాజీపేట మండలంలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. మాచవరం దొమ్మేటివారిపాలెంలో శ్రీకృష్ణ శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు భారీ అన్నసమారాధన చేపట్టారు. మురళీ కోలాటం ఆకట్టుకుంది. అంబాజీపేట స్త్రీల ఆస్పత్రి సమీపంలోని దొమ్మేటివారిపాలెంలో ఉన్న శ్రీకృష్ణుడి ఆలయం వద్ద గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉట్టిని కొట్టే కార్యక్రమాన్ని యువకులు ఘనంగా నిర్వహించారు.

పి.గన్నవరం: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను స్థానిక పాత అక్విడెక్టు వద్ద గురువారం గరుడ వేగా టీమ్ ఆధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహించారు. ఈసందర్భంగా కృష్ణ భగవానుడికి జన్మస్థల పూజ, గోపూజ, అభిషేకాలు, నరసింహ అభిషేకం, ఊంజల్ సేవ, మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి వైభవంగా ఉట్టి మహోత్సవం నిర్వహించారు. పూరీ నుంచి వచ్చిన 25 మంది భక్త బృంద సభ్యులు సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన వందలాది మంది భక్తులు పాల్గొని పూజలు చేశారు. చిన్నారులు శ్రీకృష్ణుడి వేషధారణలో అలరించారు.

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానంలో లక్ష్మీనృసింహుని సన్నిధిలోని ఉపాలయంలో గురువారం వేణుగోపాలస్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని శ్రీకృష్ణ జయంతిని ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు నిర్వహించారు. గోశాలలో కొలువైఉన్న శ్రీకృష్ణుని విగ్రహం వద్ద అర్చకులు పూజలు చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ గోవులకు పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. అంతర్వేదిపాలెంలో ఉట్టికొట్టే కార్యక్రమ విజేత పిల్లి చరణ్‌కు ఎంపీటీసీ మందపాటి రత్నం బహుమతి అందజేశారు.

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో వేంచేసియున్న శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం వద్దలో కృష్ణాజన్మాష్టమి పురష్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి తొమ్మిది రకాల పిండి వంటలతో నివేదన, ద్రవిడ వేద పారాయణం కార్యక్రమాలు నిర్వహించారు. గోశాల వద్ద గోకులాష్టమి– గోపూజ నిర్వహించారు.

కొత్తపేట: స్థానిక హరిహర దేవాలయం ప్రాంగణంలో వేంచేసియున్న వేంకటేశ్వరస్వామిని పల్లకీలో ఊరేగించి గ్రామోత్సవం నిర్వహించారు. కొత్తరామాలయం సమీపంలోని ముత్యాల వారి వీధిలో మండల వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకుడు ముత్యాల రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో యువకులు, బాలలు ఉట్టి కొట్టే కార్యక్రమం కోలాహలంగా నిర్వహించారు. పాత రామాలయం వీధుల్లో ఉట్టి కొట్టారు.


కొత్తపేట ముత్యాల వారి వీధిలో ఉట్టి కొట్టే సందడి

రాజోలు: గోశాలలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో చిన్నారులు ఉట్టి కొట్టే ఉత్సవంలో పాల్గొన్నారు. గోశాల అధ్యక్షుడు దార్ల పెదబాబు, కార్యదర్శి అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు.

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి వారి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా విశ్వక్సేనారాధనతో పాటు పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మురళీ కృష్ణునికి షోడశోపచార పూజలు చేశారు. అనంతరం జరిగిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం నవకాయ పిండివంటలతో స్వామి వారికి మహా నివేదన చేశారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీనివాస్, బత్తుల గంగారత్నం పాల్గొన్నారు.